# మరపురాని రాత్రి

కథానిక

స్థలం మెడ్రాస్ సెంట్రల్ స్టేషన్; సమయం రాత్రి ఎనిమిదిగంటలు. కొంచెం మబ్బుమబ్బుగావుంది. అన్నయ్యా నేనూ మూడుసార్లైనా తిరిగాము-కలకత్తా మెయిలు ఈ చివరనుంచి ఆ చివరకు. ఒక్క యింటరుక్లాసు పెట్టెలోకూడా స్థలం దొరకలేదు. ఆడవాళ్ళ పెట్టి సంగతి వేరే చెప్పనక్కర్లేదు; లోపలివాళ్ళని బతిమాలి తలుపు తీయమందా మనుకున్నా, తలుపుకడ్డంగా బోలెడు పెట్టెలూ, బెడ్డింగులూ పడివున్నాయి. ఇంక పది నిముషాలలో బండి బయలుదేరుతుంది. ఆఖరిప్రయత్నంగా అన్నయ్యా నేనూ గార్డుపెట్టిదాకా నడిచాము. గార్డుపెట్టిపక్కనే ఒక చిన్న యింటరుక్లాసు కంపార్టుమెంటు ఉంది. అన్నయ్య తలుపుతోసి,కూలీచేత పెట్టి, బెడ్డింగు లోపల పెట్టించి "ఇందులో ఎక్కు గిరిజా, ఇంకా వెతుకుతూంటే బండి కదులుతుంది" అంటూ తను ముందుపెట్టెలో కెక్కాడు. నేను లోపలి కెక్కేవరకూ ఆ పెట్టి ఖాళీగానే ఉందనుకున్నాను. కాని ఆ పెట్టిలో ఉన్న రెండు సీట్లల్లో ఒకదానిమీద, ఒక యువకుడు మూలగా ఒదిగి కూర్చునిఉన్నాడు. "ఒంటరిగా రాత్రిపూట ఈ యువకునితో ప్రయాణమా" అని నేను కొంచెం భయపడ్డాను. ఆ వ్యక్తికేసి పరికించి చూశాను. కాని అతను ఈ ప్రపంచంలో ఉన్నట్టులేదు. ఏదో శూన్యంలోనిచూస్తూ విపరీతంగా బాధ పడుతున్నట్టు కనపడ్డాడు. అన్నయ్య అతనికేసి ఒకనిముషంచూసి "ఏమోయ్ రఘుపతీ! నువ్వా, ఎవరో అనుకున్నాను. పెద్దవాడ వయ్యావు. ఇంజనీరింగు ప్యాసయావటగా. ఏంచేస్తున్నావేమిటి?" "శేషగిరా నిన్ను చూసి చాలా కాలమైంది. మదరాసులో యేం చేస్తున్నావు? నేను ఇక్కడే ప్రయివేటు కంపెనీలో పనిచేస్తున్నాను" అన్నాడతను. "నేనూ మా చెల్లెలు గిరిజాకూడా యమ్. బి. బి. యస్. పాసయి ఇక్కడే జనరలు హాస్పిటలులో హౌస్ సర్జనుగని చేస్తున్నాము. చెల్లి వారం రోజులు సెలవుపెట్టి ఏలూరు వెడుతోంది అమ్మని నాన్నని చూచిరావడానికి." "నేనూ ఏలూరే, మా మేనత్తగారింటికి వెడుతున్నాను" అన్నాడతను. అన్నయ్య నావైపు తిరిగి "నేనూ, రఘుపతీ స్కూలుఫైనలుదాకా కలిసి చదువుకున్నాము బెజవాడలో. చాలా మంచివాడు. నీకు సహాయంగా ఉంటాడు. టైముంటే పేపరు తెచ్చిపెడతా"నంటూ పెట్టి దిగి వెళ్లాడు.

రఘుపతి అలాగే శూన్యంలోకి చూస్తూ ప్రపంచంతో తనకేమీ సంబంధం లేనివాడిలాగా ఉన్నాడు. అతను ఏదో భరించలేని వ్యధను అనుభవిస్తున్నాడు కాబోలు; మధ్యమధ్యనిట్టూర్పులు విడుస్తున్నాడు. అప్రయత్నంగానే అతనివైపు మళ్ళీ మళ్ళీ చూచాను. ఎన్నిసార్లు చూచినా తిరిగి చూడాలనే అనిపించింది అతని వాలకంచూస్తే. కొన్నిదినాలుగా కడుపునిండా అన్నం తిన్నట్టుగాని కళ్ళనిండా నిద్రపోయినట్లుగాని తోచదు. అయినాకూడా అతను చాలాచక్కగాఉన్నాడు. అతనినిచూస్తే ఎందుకో విపరీతమయిన జాలికలిగింది నాకు. కొన్ని దినాలుగా తల దువ్వుకోకపోవడంచేత నుదుటిమీద పడుతూన్న అతని జుట్టును పైకితోసి సరిచేద్దామా అనిపించింది.

అన్నయ్య పేపరుతెచ్చి నాచేతి కిచ్చాడో లేదో, రైలు కూతవేసి కదిలింది. "జాగ్రత్త" అని మాత్రం అని అన్నయ్య వెనక ఉండిపోయాడు. రైలు ముందుకు ప్రయాణం సాగించింది. నేను పేపరు చదువుదామని ప్రయత్నించాను కాని, నాకళ్లు పేపరుమీద ఉన్నా, నా దృష్టంతా రఘుపతిమీదేఉంది. అతను మధ్యమధ్య ఏదేదో గొణుగుతున్నాడు.

"ఎంతపని చేశావు?, నువ్విల్లా చేస్తావని

"బాలచంద్ర"

నేను కలలోకూడా అనుకోలేదు. నేనేం తప్పు చేశానని నువ్వు నన్నింత కఠినంగా శిక్షించావు? ఓ భగవంతుడా, నా రమ హృదయాన్ని రాయిగా మార్చేశా వెందుకు, నామీద నీకు కొంచెంకూడా దయలేదా? ఈ బాధతో నేనిలా మగ్గిపోవలసిందేనా, దీనిలోంచి నాకింక విముక్తి లేదా, ఆశలేని బ్రతుకు ఎంతభారము" యీ విధంగా అతను ఎదుట మరొకవ్యక్తి ఉన్న విషయంకూడా మరిచిపోయి, గట్టిగా గొణుగుతున్నాడు. అది మెయిలు అవడంచేత ఏవో పెద్దపెద్ద స్టేషనులలో మాత్రం ఆగుతోంది. ఒక స్టేషనులో ఒక వృద్ధుడు మా పెట్టెలోకెక్కాడు. తరవాత స్టేషనులో అతను దిగిపోయి ఒక స్త్రీ ఎక్కి నాప్రక్కని కూర్చుంది. మరొకస్టేషనులో ఆమెకూడా దిగిపోయింది. అక్కడ జంక్షను కాబోలు బండి దాదాపు అరగంటఆగిపోయింది. మరెవ్వరూ మా పెట్టెలోకి రాలేదు. టైము పన్నెండు గంటలయింది. బయట సన్నసన్నగా చినుకు పడుతోంది. ఒక ముష్టిది మా పెట్టెలో ముందునుంచి రెండుసారులు తిరిగింది.

"ఒక పాతవస్త్రం దయచేయించండిబాబూ, అమ్మా, సలికి సస్తున్నాను, దిక్కుమాలినదాన్ని" అని హృదయవిదారకంగా కేకలు వేస్తోంది. రఘుపతి ప్రక్కనున్న బెడ్డింగుమీద ఒక సంచీ ఉంది. ఆ సంచీలో ఏదో పేకెట్టుఉంది. ముష్టిది మా పెట్టెదగ్గర కొచ్చినప్పుడల్లా రఘుపతి ఆ పేకెట్టును పైకితీసి మళ్ళీ ఏదో సంకోచంతో సంచీలో పెట్టేశాడు. ముష్టిది మూడవసారి వచ్చింది. ఈసారి రఘుపతి తొందరగా ఆ పేకెట్టు పైకితీసి కిటికీదగ్గరకు వెళ్ళి దానిని ముష్టిదాని చేతిల్లో పడేశాడు. ముష్టిది పరమానందంతో ఆ పేకెట్టును కళ్ళద్దుకుని విప్పడం మొదలు పెట్టింది: రఘుపతికి తన కృతజ్ఞత తెలియ జేస్తోంది. "ఎంత మంచి బాబువి. నా వరాల తండ్రికోసం ఏతల్లి పూజచేస్తోందో! కడిపెడు బిడ్డలు పుడతారు నా వజ్రాలబాబుకి" పేకెట్టు పూర్తిగావిప్పి ముష్టిది కంగారుతో అంది: "బాబూ, మరిసిపోయి ఏదో చిల్కుచాలువ ఇచ్చేసినావు. ఇది నాకాడ ఎవరేనాసూత్తే ఎత్తుకొచ్చినావని తంతారు. బాబూ ఇది తీసుకుని ఓ పాతబట్ట పడెయ్యి." అతను దాని మాటలు వినిపించుకోకుండా బాత్‌రూమ్‌కి వెళ్లి తలుపేసుకున్నాడు.

ఆ శాలువ చూద్దామని నేను కిటికీదగ్గరకు వెళ్ళాను. అకుపచ్చటి కాశ్మీరు శాలువ, కొత్తది, చుట్టూ ఎంబ్రాయిడరీ అంచుతో మెరిసిపోతోంది. రఘుపతి పిచ్చివాడుకాదు కదా అని నేను కంగారుపడ్డాను. ముష్టిది నన్నుచూసి "ఆ మారాజు ఈ చాలువ నాకిత్తావుంటే నువ్వు చూస్తూ ఊరుకున్నావా? ఇదుచ్చుకుని నాకో పాతగుడ్డ పడెయి తల్లీ"అంది. "ఆయనకు ఈ మధ్య మనస్సు సరిగాలేదు. ఆ శాలువ ఇలా ఇయ్యి"అని తీసుకుని, తొందరగా పెట్టెలోపెట్టి ఒక పాతదుప్పటి ముష్టిదానికిచ్చి దాన్ని పంపించేశాను. ఏమీ ఎరగనట్టు నా సీటులో కూర్చున్నాను. రైలు ఇంకా కదలలేదు. బాత్‌రూమ్‌లో కూడా అతను తనలోతను ఏదో గట్టిగా మాట్లాడుకుంటున్నాడు. మాటలు స్పష్టంగా తెలియలేదు. కాని గద్గదస్వరంలో వినబడుతున్నాయి. కొంచెం సేపటికి అతను తలుపుతీసుకుని బయటకువచ్చాడు. అతని కళ్లు బాగా ఏడిచినట్టు ఎర్రగాఉన్నాయి. బంగారురంగులో ఉన్న అతని నుదురు ఎర్రగా కంది ఉంది-రైలుపెట్టెకు అతని నుదురు కొట్టుకున్నాడో లేక చేతులతో ముఖము మోదుకున్నాడో - అరిచేతులు కూడా ఎర్రగా కంది ఉన్నాయి. అతని దీనావస్థ చూస్తూంటే నా గుండె తరుక్కుపోయింది. కాని పలకరిద్దామంటే ధైర్యం చాల్లేదు. అతను ఏదో వెతుకుతూన్నవాడిలా నలువైపులా చూశాడు. పైబల్లమీద ఉన్న నా మరచెంబుమీద అతని కళ్ళుపడ్డాయి. దాహంతో నాలికెండిపోతూన్నట్టుంది పాపం.

"కాసిన్ని మంచినీళ్లిస్తారా?"అన్నాడు. "ఓ" అని నేను నీళ్ళుగ్లాసులోపోసి ఇచ్చాను. ఆత్రంతో రెండుగ్లాసుల నీళ్ళుతాగాడు. నా వంక చూడకుండానే "థాంక్స్"అన్నాడు. అతను నావైపు ఒక్కసారి చూస్తే బాగుండుననిపించింది. చివరకి నేనే పలుకరించాను.

"మీ వంట్లో బాగాలేనట్టుంది."

"నా వంట్లోనా, అబ్బే, ఏంలేదు బాగానే ఉంది."

"మీరేదో పెద్దచిక్కులో ఉన్నట్టున్నారు."

"ఈ ప్రపంచంలో ఎవరికంతు వారనుభవించాలిగా."

"ఆర్థికమైన చిక్కులు వచ్చినట్టున్నాయి."

"అటువంటివి అందరికీ ఉండేవేగా."

"దగ్గరబంధువులెవ్వరైనా సుస్తీగా ఉన్నారో, లేక బంధునష్టం కలిగిందో."

"అదీ జనసామాన్యమైన ఇక్కట్టేగా."

"పోనీ, మీరు ప్రేమించిన అమ్మాయికీ మీకూ వివాహం కాకుండా కిట్టనివాళ్ళెవరో అడ్డువచ్చి ఉంటారు."

"మీరు పొరపాటుపడుతున్నారు. ఆ విధంగా జరిగితే ఇంత బాధపడవలసిన అవసరమేముంది? ప్రేమికులిద్దరూసానుభూతితో అనుభవించేదేదైనా ఆనందదాయకంగానే ఉంటుంది. నాది ఒక విపరీతమైన పరిస్థితి." అతని కన్నులలో నీరు తిరిగింది.

"ఆమే మీకు అన్యాయంచేసిందన్నమాట" అన్నాను నేను ఆలోచించకుండానే.

"అంతే జరిగింది. అది జరిగి రెండుమాసాలయినా, నా గుండెల్లోని గాయం ఇప్పుడే ఏర్పడినంత లోతుగా బాధగా ఉంది. సరిపెట్టుకుని రోజులుగడపాలని ఎంత ప్రయత్నించినా, నా చేతకాకుండా ఉంది. నా హృదయ దౌర్బల్యానికి నన్ను చూచి జాలిపడుతున్నారో అసహ్యించుకుంటున్నారో నాకు తెలియదు" అన్నాడతను కన్నులు తుడుచుకుంటూ.

"అసహ్యించుకోవడమా? ఎంతమాట! నా మాట నమ్మండి. మిమ్మల్ని చూస్తూంటే నా గుండె తరుక్కుపోతోంది. మీహృదయం తేలికపడడానికి నన్నేంచేయమన్నా చేస్తాను."

"అవును మీరు చాలా ఉదారహృదయులులాగే కనపడుతున్నారు. నా నిర్భాగ్యపు కథను మీలాంటివాళ్ళతో చెప్పుకుంటే కొంత మనశ్శాంతి కలుగుతుందేమోననే ఆశ నాకు లేకపోలేదు. కాని ఇప్పటికే ఒంటిగంట దాటింది. ఈ అర్థరాత్రివేళ మీ నిద్ర పాడుచేసి నా విషాదగాథతో మీకు విసుగుపుట్టించడం నాకిష్టంలేదు."

"మీకభ్యంతరం లేకపోతే జరిగింది చెప్పండి. ఎంతో సానుభూతితో ఉత్సాహంతో వింటాను."

"సరే చెబుతాను వినండి." అతడు తన కథ మొదలుపెట్టాడు.

* * *

"మా తండ్రిగారు ప్లీడరు. మా తలిదండ్రులకు మా అక్కా నేనూ యిద్దరమే. అక్క వివాహమై అత్తవారింటికెళ్ళింది. నాకు మా తండ్రిగారు ఇంజనీరింగు వరకూ చెప్పించారు. మనోరమ మా ప్రక్కవీధిలో ఉంటున్న ఒక తాసిల్దారుగారి కూతురు. ఆమె నేనూ, ఒక స్కూలులోనే ఒక కాలేజీలోనే ఇంటరుమిడియట్ వరకు చదివాము. తరవాత నేను ఇంజనీరింగుకు మదరాసు కెళ్ళాను. ఆమె మెడికల్‌కి వైజాగ్ కెళ్ళింది. సెలవులకు ఇంటికివచ్చినప్పుడల్లా మేము కలుసుకునే వాళ్ళం. కాని ఒక సంవత్సరం క్రితం వరకూ స్నేహం సామాన్య స్నేహంగానే ఉండేది. ఆమెలో ఉన్న దర్జా, చురుకుతనము చూస్తే నాకెంతో ముచ్చటగా ఉండేది. నిరుడు నా ఇంజనీరింగు పూర్తి అయి ఇంటికి వెళ్ళాను. మనోరమకూడా సెలవులకు ఇంటికి వచ్చింది. ఈసారి ఆమె మాయింటికి ఎక్కువగా రావడం మొదలుపెట్టింది. ఒకనాడు ఇద్దరం మా డాబామీద కూర్చున్నాము. ఆమె అన్నది, "అబ్బాయిగారు పరీక్ష ప్యాసయారు. ఇంక పిల్లనిచూసుకుని పెళ్లి చేసుకోవడమే తరవాయి."

"పిల్లనీ చూసుకున్నాను. పిల్ల కిష్టమయితే పెళ్ళిచేసుకోవడమే తరవాయి" అన్నాను. ఆమె చిలిపిగా నానోరు మూసింది. ఆ రోజునుంచీ మా స్నేహం ప్రేమగా మారింది. ఆ సెలవులంతా మేము ఎంతో ఆనందంగా గడిపాము.

ఒకరోజు అమ్మ నన్నుపిల్చి అన్నది "నువ్వు మనోరమని పెండ్లిచేసుకోడం నా కిష్టమే. నువ్వు దృఢనిశ్చయంతో ఆమెతో స్నేహంచేస్తే నాకేమీ అభ్యంతరంలేదు. కాని ఏ చిలిపి కారణంచేతైనా తరువాత వెనుతీశావా, నేనే నిన్ను అసహ్యించుకుంటాను. ఏ ఆడదానికి అన్యాయం జరిగినా నేను సహించను" "అలా ఎప్పటికీ చెయ్యనమ్మా. అయినా మనోరమ కేంలోటుని?" అన్నాను నేను. సెలవు లాఖరుని నేను మదరాసు వెళ్ళి ఉద్యోగంలో చేరాను. ఆమె ఫైనల్

యమ్. బి. కి హైజాగు వెళ్ళింది. ఆ సంవత్సరమంతా మాకు ఉత్తరప్రత్యుత్తరాలు జరుగుతూనే ఉన్నాయి. ఆమెకి సెలవు లిచ్చినప్పుడే నేనుకూడా సెలవు సంపాదించి ఇంటికి వెళ్ళాను

ఈసారి ఆమె మునుపటంత ఉత్సాహంగా కనబడలేదు. నాయందు కొంత అశ్రద్ధ చూపుతూన్నట్లనిపించింది. కాని నేనే పొరపాటు పడుతున్నానేమోనని సమాధాన పడేవాడిని. నేను వాళ్ళింటికి వెడితే ఏదో ఒకవంక చెప్పి బయటకు వెళ్ళిపోయేది. తను మాయింటికివస్తా, వస్తాననడమే కాని రాత్రింబగళ్లు తనకోసం నేను ఎదురుచూచినా తను రాలేదు. ఆమెను చూడకుండా, ఆమెతో మాట్లాడకుండా ఉండలేక ఆడదానిలాగ ఏడ్చేవాడిని. ఒకరోజున నేను ఆమె యింటికి ఆరుసార్లు వెళ్ళాను. ఆరవసారి ఆమె దర్శనమయింది. మా యింటికి ఒకసారి రమ్మని బ్రతిమాలాను. సాయంకాలం వస్తానన్నది, నిజంగా వస్తుందనుకుని రాత్రి చాలా సేపటివరకు డాబామీద అలాగే కూర్చుండిపోయాను. కాని ఆమె రాలేదు. ఆమె అదివరకు అలా ఎన్నోసార్లు చేసినా ఇంకా ఆమె వస్తుందనే నమ్మకమే నాకు. అమ్మ చూసిచూసి అన్నానికి పిల్చింది. ఆకలి లేదన్నాను. ఆమె వచ్చి, ఆలస్యమయినందుకు బాధపడుతుందనే ఆశతో, ఎన్నో విషయాలు ఆమెతో చెప్పుకోవాలనే ఆత్రంతో తెల్లవారే వరకు ఆ డాబామీద అలాగే కూర్చున్నాను.

క్రితంరోజున ఆమెకు కానుకగా యిద్దామని ఒక కాశ్మీరు శాలువ కొన్నాను. మరునాడు ఆ శాలువా తీసుకుని ఆమె యింటికి వెళ్ళాను ఆమె గదిలో ఎవరితోనో మాట్లాడుతోందని విని నేను అరుగుమీద కూర్చున్నాను. లోపలినుంచి నాకు మాటలు స్పష్టంగా వినవస్తున్నాయి. ఆమె కాబోయే వరునితో మాట్లాడుతోంది. అతను వాళ్ళకు బంధువే, చాలా డబ్బుకలవాడు కూడా. నా చెవులను నేనే నమ్మలేకపోయాను. వాళ్ళిద్దరూ బయటికివచ్చారు నాకళ్లు తిరిగిపోయాయి అతను కారులో ఎక్కి వెళ్ళిపోయాడు. ఆమె నన్ను లోపలికిరమ్మని పిలిచింది. ఆమె నన్ను కూర్చోమనైనా అనలేదు. నేనే ఆమె కెదురుగానున్న కుర్చీలో కూలబడ్డాను.”

ఇంతవరకు చెప్పి అతడు ఆగాడు అతనికి ఆమెమీదగల ప్రేమకి ఆమెమీద నాకెందుకో అసూయ కలిగింది.

“నాకు ఆకలిగాఉంది మీదగ్గర తినేందుకేమయినా ఉందా?” అన్నాడతను నేను నా పెట్టెలోనుంచి బిస్కట్లపొట్లం విప్పి రెండు బిస్కట్లు అతనికిచ్చాను. ఆ రెండు బిస్కట్లు అతను తిన్నాడు. కాఫీ ఫ్లాస్కులోంచి గ్లాసులో పోసి చేతి కియ్యబోయాను. అతను చాలా నీరసంగా ఉన్నట్టున్నాడు, చేతులు కదపకుండా తల ముందుకువంచి నోరు తెరిచాడు. నేను అతని పక్కకెళ్ళి కూర్చుని కాఫీ తాగించి తిరిగి నా సీటులో కూర్చున్నాను. “మీరు చాలా మంచివారు; మీకు నిద్దరవస్తోందేమో పాపం” అన్నాడు.

“ఫరవాలేదు కథపూర్తి చెయ్యండి” అన్నాను.

“ఏముంది? తప్పని సరి పరిస్థితులేవో వచ్చాయని ఆమె చెబుతుందనుకున్నాను. నన్ను చూసి జాలి పడుతుందనుకున్నాను. కాని అటువంటిదేమీ జరగలేదు. చివరకు నేను తీసుకువెళ్ళిన కానుకను ఆమె తిరస్కరించింది. తన వివాహానికి తొలికానుకగా దానిని స్వీకరించమని బ్రతిమాలాను.

“ఇప్పుడేంతొందర? అప్పుడే ఇద్దువుగానిలే” అంటూ ఆమె లేచి లోపలికి వెళ్లిపోయింది. నేను కాళ్ళీడ్చుకుంటూ ఇంటికి వెళ్ళాను, అమ్మ సంగతంతా గ్రహించి చాలా విచారించింది. తరవాత వారంరోజుల్లో ఆమె వివాహము జరిగిపోయింది. ఆ పెండ్లినాడు రాత్రి నేనుపడ్డ యాతన దేవునికే తెలుసు. పెండ్లికొడుకు తప్పేమీ లేకపోయినా అతనిమీద నాకు ఎక్కడలేని అసూయా పుట్టుకొచ్చింది. నా దీనావస్థకి నాకే అసహ్యంవేసింది. ఆ రాత్రి ఏదో ఒక విపరీతకార్యం చెయ్యాలన్నంత ఆవేశం కలిగింది. చనిపోతే బాగుండుననిపించింది. కాని అమ్మా, నాన్నా దుఃఖం పాలవుతారు. బతికుంటే నాకు సుఖం లేకపోయినా ఎవరికైనా ఉపకారం చెయ్యవచ్చును అనుకున్నాను. ఆ శాలువను అగ్గిపుల్లగీసి అంటించేద్దామనిపించింది. ఏ దరిద్రులకైనా ఇస్తే సంతోషిస్తారు కదా అని నా ఆవేశాన్నంతా అణుచుకున్నాను.

ఆ తరవాత నా సెలవు పది దినాలుండి. ఆ పదిదినాలూ నేనావూళ్ళో ముళ్ళమీద ఉన్నట్టే ఉన్నాను. ఏ మిత్రులైనా నన్ను చూచి హృదయపూర్వకంగా జాలిపడ్డా అది నాకు పరాభవం లాగే ఉండేది. నన్ను హేళనచేసిన వాళ్ళను చూస్తే మండు కొచ్చేది. ఆ దంపతుల మాట నాదగ్గర కదిపి చూద్దామనే నీచబుద్ధి ఉన్న వాళ్ళనుచూస్తే నమిలిమింగెయ్యాలన్నంతకోపం వచ్చేది. అన్నీ సహించుకున్నాను. సెలవులయిపోయి. మదరాసువెళ్ళి డ్యూటీలో చేరాను. కాని మనశ్శాంతి ఏదీ? ఏపని చేస్తున్నా ఆమె చేసిన అన్యాయమే జ్ఞాపకమొచ్చేది. ఆ బాధ, ఆ పరాభవము, ఆ హైన్యత నన్నుపట్టుకు వదలలేదు. దీనినుంచి తప్పించుకునేమార్గమేమీ కనపడలేదు. వారంరోజులు సెలవుపెట్టి ఏలూరు మా మేనత్తకొడుకు దగ్గరకు బయలుదేరాను. ఆ కాలువచూచినప్పుడల్లా ఆమెనిర్దాక్షిణ్యము నన్ను వెక్కిరించినట్లనిపించేది. చివరకు దానిని ఇందాకా ఆ ముష్టిదాని కిచ్చేసి ఆ బరువు వదిలించేసుకున్నాను"

* * *

అతడు ఒక్కనిముషమాగి తిరిగి అన్నాడు. "మీరు నాకథంతా శ్రద్ధగా విన్నారు. నా మనస్సు కొంత తేలికపడింది. కాని నా నిస్పృహాకీ నిరాశకీ మీరేం చేస్తారు? నాఖర్మం నే ననుభవించవలసిందే." నేను మెల్లిగా లేచివెళ్ళి అతని పక్కని కూర్చున్నాను. అతని గుండెలమీద చేతితో నిమురుతూ అన్నాను: "చూడండీ. ఈ నాచేత్తో ఎంతోమంది గాయాలకు కట్లుకట్టాను. బాధ నివారణ చేశాను. గాయాలు మాన్పాను. ఎంతమందికో జీవితాశని కల్పించి ధైర్యోత్సాహాల నిచ్చాను. నిజం చెప్పండి. నా స్పర్శ మీకు హాయిగా లేదూ?"

"కాని నా హృదయం బద్దలయి పోయింది. శతసహస్ర భిన్నాలుగా విచ్ఛిన్నమైన క్షీరభాండము, నేలపాలైన పాలు, వీనినేంచేసుకుంటారు మీరు?" నా చేతిని తనచేత్తో గుండెకు మరి కొంచెం గట్టిగా ఒత్తుకున్నాడు.

ముఖంమీద పడుతూన్న అతని జుట్టు పైకి తోస్తూ అన్నాను, "మీరు అనుమతిస్తే ఏమైనా చేసుకుంటాను. పగిలిపోయిన ఆ భాండాన్ని తిరిగి అతుకులుపెట్టి తీర్చిదిద్దుతాను. ఈసారి దానిని అమృతంతో నింపుకుంటాను. నన్ను అనుగ్రహించరూ?" దీనంగా అతనిగడ్డం పట్టుకు వేడుకున్నాను.

"కాని ఒక్క సందేహం."

"అవును నాకుతెలుసు మీ సందేహం. ఆమెలాగ నేనుకూడా మీ కన్యాయం చేస్తానేమోనని. మీది వేటుతిన్న మనస్సు. మీరలా భయపడడంలో మీ తప్పేమీలేదు. ఒక్కమాటవినండి మీరు నాయందు విశ్వాసముంచి మీ మనస్సులోని బాధనంతా నాతో చెప్పుకున్నారు. మిమ్మల్ని చూచి నేను పడవలసినబాధకన్నా ఎక్కువబాధే పడ్డాను, అ నేనొక్కటే మీరుజ్ఞాపకం ఉంచుకోండి. అంతేచాలు. పదిగంటలక్రితం నే నెవరో మీరెరుగరు. మరి రెండుగంటల తరవాత మీదారిమీది నాదారినాది." అంటూ నేనులేచి వెళ్ళి నాసీటులో కూర్చున్నాను. నా మనస్సెందుకో నే నెప్పుడూ ఎరగనంతగా బాధపడింది. నేనుకిటికీలోంచి తలబయటికి పెట్టుకొని వెక్కి వెక్కి ఏడుస్తున్నాను. పదినిముషాలల్లాగే గడిచింది. అతను లేచివచ్చి నా వెనక్కాలకూర్చుని నా భుజంమీద చెయ్యివేశాడు. "ఏడుస్తున్నావా గిరిజా?" అన్నాడు అనునయంగా. నేను కన్నీటితో అతనివైపు తిరిగాను. అతను జేబురుమాలు తీసి నా కళ్లు తుడిచాడు. నాకింకా ఏడవాలనిపించింది. పది గంటల క్రితం నే నెవరో మీ రెరుగరు అన్నారు. మరి నే నెవరో మీకు తెలుసా?" అన్నాడు. "తెలుసు. ఈ ప్రపంచమంతలో నే నెరిగినది మీరొక్కరే. నేను మిమ్మల్ని అనాదినుంచీ ఎరుగుదును. ఈ సృష్టిలో ఉన్నన్నాళ్ళూ నేను మిమ్మల్ని మరువలేను. మీరు లేకపోతే నా బతుక్కి అర్థమేలేదు" అన్నాను.

"అయితే నా సందేహం మీరు తీర్చలేరూ?"

"నే నెప్పుడైనా మీ కన్యాయం చేస్తానేమోననేకాగా మీ భయం? అటువంటి పరిస్థితి ఎప్పటికీ ఏర్పడదు. ఒకవేళ ఖర్మంచాలక ఏర్పడినా నన్ను నేను నాశనం చేసుకుంటాను కాని మీ మనస్సుకి నలుసంతైనా నొప్పి కలుగనివ్వను."

అతను నా రెండు భుజాలమీద చేతులు వేసి నా ముఖంలోకి రెప్ప వాల్చకుండా చూశాడు. ఆ చూపుకి తట్టుకోలేక నేను కళ్ళు మూసుకున్నాను. అలా మేము ఎంతసేపు ఉన్నామో నాకు తెలియదు అతడు నా రెండు కన్నులమీద దీర్ఘమయిన ముద్దులు పెట్టుకున్నాడు. ఆ ముద్దులతో నాకు తెలివి వచ్చింది. కన్నులు తెరచిచూచాను. తెలతెలవారుతోంది. నేను అతని చేతులు నా భుజములమీదనుంచి మెల్లిగా తీస్తూ అన్నాను: "మన స్టేషనింక అర గంటలో వస్తుంది."

దంతధావనం ముగించి కూర్చున్నాం. అతని తువాలు మాసి ఉండడంచేత నా తెల్లని తువాలు అతనికిచ్చాను. అతడు దానితో ముఖముతుడుచుకుని తన పెట్టెలో పెట్టుకున్నాడు పరధ్యాన్నంగా. అతనిదగ్గర దువ్వెన అద్దం కూడా లేవు. అతని తలకి నూనెరాసి సావకాశంగా తల దువ్వాను. ఎన్ని సంవత్సరాలనుంచో కలిసిఉన్న మిత్రులలాగ మే మొకరికొకరు సాయం చేసుకున్నాము. మా బెడ్డింగులు రాత్రి విప్పకపోవడంచేత వాటిని కట్టనవసరం లేకపోయింది. రఘుపతి పైకి చూసి "నీ పెట్టె తాళంవెయ్యడం మరిచిపోయావు గిరిజా" అన్నాడు. "మరిచిపోలేదు పనం"దంటూ నేను పెట్టెతీసి శాలువా పైకితీసి వీపుపైన కప్పుకున్నాను. అతను నావైపు తత్తరపడి చూశాడు. క్షమాయించుకుని అన్నాడు "ఈ ఊదా సిల్కుచీరమీద, ఈ ఆకుపచ్చ శాలువ ఎంతో బాగుందిస్మా!" "మరి నేనో" అన్నాను చిరునవ్వుతూ. "నువ్వా, నువ్వు నిజంగా మనోరమకన్నా ఎంతో చక్కగా ఉన్నావు" ప్రతి స్త్రీ ఏ మాటలు తను ప్రేమించినపురుషుని నోటినుండి, ఒక్కసారికాదు, వందసారులైనా వినాలని కుతూహలపడుతుందో ఆ మాటలు వీనులవిందుగా నా చెవిని పడ్డాయి. నా మనస్సానందంతో ఉప్పొంగిపోయింది. నేను ఆ శాలువ మీదనున్న లేబులు అతనికి చూపెట్టాను. అతను ఆశ్చర్యంతో నావైపుచూచాడు. రాత్రి నేనుచేసిన పని అతనికి చెప్పాను. అతను ఆనందాతిరేకంతో నా చేతిని పైకెత్తి తిరిగి ముద్దుపెట్టుకున్నాడు.

అంతలో రైలు ఏలూరు స్టేషనులో ఆగింది.

---

# నమ్మలేని నగ్నసత్యాలు

యం. హీరాలాల్ రాయ్

వీధిగదిలో కూర్చుని యివాళటి ముఖ్యవార్తల్ని ఎడిట్ చేసుకుంటున్నాను. ఎక్కణ్ణించో తుపాను వరవడితో వచ్చిపడింది విద్యార్థిబృందం నన్ను వెదుక్కుంటు గదిలోకి. వాళ్ళచేతుల్లో బూంధీ, కారప్పూస, స్వీటుమొదలైన హోటలు తిలుబండారాల పొట్లాలున్నాయి. మరోమాట లేకుండా వాటిని నాముందువిప్పి "కొంచెంపీటిని రుచిచూడండి మహాశయా!" అన్నారు.

"క్షమించండి! కడుపునిండా అన్నంతిని కూర్చున్నా. మరెప్పుడన్నా తింటాను" అన్నాను.

"అలా కాదు...తిని తీరాలి" అని పట్టుబట్టారు వాళ్ళు. వాళ్ళ యీ అభ్యర్థనని నేను కాదనలేక పోయాను. కాదన్నా వదిలేట్టులేరు. తప్పనిసరిగా కొంచెం రుచిచూశాను. స్వీట్సు సహజంగా తీయగానే ఉన్నాయి రుచికి. కాని పిండి మాత్రం కత్తీది జాస్తిగాఉంది...కొంచెం కారా నమిలాను...అలా పూర్తిగా ఇంక నమిలానో లేదో...నాకు వాంతివస్తున్నట్టనిపించింది. ఆశ్చర్యంతో దాన్ని వాసచూశాను...ఛ...ఛ.. కుళ్ళిపోయిన కొబ్బరివాసన వేసింది గప్పున. ఏదో ఓ ప్రత్యేకమైన నూనెతో దీన్ని తయారు చేశారల్లేవుంది. నాఘ్రాణేంద్రియం ఆ దుర్వాసనతో కుళ్ళిపోయినట్టనిపించి. అదితెచ్చిపెట్టి; తినమన్నందుకు వాళ్ళని విసుక్కుంటూ, త్వరగా లోపలికెళ్ళి పుక్కిలించి ఉమ్మేసి, ఇన్ని ద్రాక్షపళ్ళు నమిలాను...అప్పటికి నాప్రాణల కుదుటపడింది.

"క్షమించండి మహాశయా! మావల్ల మీరు చాలా హైరానపడ్డారు...ఇవన్నీ ఎక్కడి